మూడు రోజులుగా వర్షం నీటిలోనే..!

● పలు కాలనీలు జలమయం
● పట్టించుకోని అధికారులు

బాపట్ల: గత కొద్ది రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణం, మండలంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. మార్కెట్ యార్డు సమీపంలో అఖిలభారత రైతు కూలి సంఘం సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న కాలనీమొత్తం మునిగిపోయి గృహాల్లోకి నీళ్లు వచ్చాయి. గత మూడు రోజుల నుంచి వర్షం నీటిలోనే మగ్గిపోతున్నా ఏ ఒక్క అధికారి కూడా మా వైపు తొంగిచూసిన దాఖలాలు లేవని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో పరిస్థితి ఇలా...

బాపట్ల పట్టణంలోని దేవుడిమాన్యం, శారదపురి కాలనీ, డ్రైవర్స్ కాలనీ, మార్కెట్‌యార్డు ఎదుట కాలనీ, వైఎస్సార్‌కాలనీ, జగనన్న కాలనీలో వర్షపు నీటిలో మునిగిపోయాయి. డ్రైనేజీలు లేకపోవటంతో మురుగునీటితోపాటు వర్షపు నీరు రోడ్డు మీదకు చేరటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని, అయినా మున్సిపల్ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూసిన పాపాన పోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శారదపురి కాలనీలో నిలిచిన వర్షపు నీరు



హనుమంతరావు కాలనీ శివారులో నిలిచిన వర్షపు నీరు



దేవుడిమాన్యంలో నిలిచిన వర్షపు నీరు

పట్టణంలో తీవ్రంగా డ్రైనేజీ సమస్య

బాపట్ల పట్టణంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా కనీసం రెండు మూడు రోజుల పాటు రోడ్లుపైనే మురుగు నీటితో పాటు వర్షపు నీరు నిల్వ ఉంటుంది. కనీసం కచ్చా డ్రైనేజీలైనా తీయిస్తే సమస్య పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు వాపోతున్నారు.

● ఒక పక్కన వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా జ్వరాలతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. మరో వైపు అంటువ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. నిలిచిన వర్షపు నీటిని తొలగించి కనీసం బ్లీచింగ్ పౌడర్‌నైనా చల్లించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ ఎంపీడీవోకు సత్కారం



చుండూరు(వేమూరు): మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తున్న టి.ఉషారాణి సేవలు మరువలేమని ఎంపీడీవో సుదీప అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఆమెను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ డిప్యూటీ ఎంపీడీవో టి.ఉషారాణి ప్రమోషన్‌పై మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం తరపున ఆమె ను సత్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, గ్రామ సర్పంచ్‌లు పందిపాటి ఏసు, కారుమూరి సుబ్బారెడ్డి, యల్లరెడ్డి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సులపై అవగాహన కలిగి ఉండాలి



చెరుకుపల్లి: విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు వృత్తి విద్య కోర్సుల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని వొకేషనల్ ఉపాధ్యాయుడు బి.ధ్యాన్‌చంద్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని గుళ్ళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం కవిత సహకారంతో ఆదివారం ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్‌లో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుళ్ళపల్లిలోని ఓ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల తయారీ, వాటి నిల్వ, శుభ్రత, హోటల్లో జరుగు సర్వీసింగ్ తదితర ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించి వారి అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరపడవచ్చని తెలిపారు.

కళాశాల అభివృద్ధికి డాక్టర్ నాదెళ్ల సేవలు ఎనలేనవి

కరస్పాండెంట్ బుచ్చియ్యచౌదరి



నగరం: స్థానిక ఎస్వీఆర్‌ఎం కళాశాల అభివృద్ధికి డాక్టర్ నాదెళ్ల వెంకట కృష్ణారావు చేసిన సేవలు ఎనలేనవని కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి చెప్పారు. కళాశాలలో ఆదివారం వెంకట కృష్ణారావు సంసర్మణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చియ్యచౌదరి మాట్లాడుతూ కళాశాల వ్యవస్థాపక సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా నాదెళ్ల వెంకట కృష్ణారావు పనిచేశారన్నారు. తీరప్రాంత ప్రజలకు ఉన్నత విద్యను అందించాలనే సదుద్దేశంతో కళాశాల స్థాపనకు కృషి చేశారన్నారు. కళాశాల అభివృద్ధికి కృష్ణారావు చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వెంకట నారయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర జట్టుకు 'మున్సిపల్' విద్యార్థులు



తెనాలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గంలోని రేవేంద్రపాడులో శనివారం జరిగిన అండర్–17 బాలుర, బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారుల్లో 9వ తరగతి విద్యార్థులు లీల నాగేంద్ర బాబు, దమ్ము తేజ, బాలికల విభాగంలో పాలపర్తి హేమంబ్ర లక్ష్మీప్రసన్న ఉన్నారని హైస్కూలు హెచ్‌ఎం కె.భారతి తెలియజేశారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన అభినందించారు.

మోహన్‌లాల్‌కు దాదా సాహెబ్ అవార్డుపై హర్షం

తెనాలిరూరల్: విలక్షణ నటుడు మోహన్‌లాల్ 2023 సంవత్సరానికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికవడంపై మా–ఏపీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం పెదరావూరులోని జరిగిన సమావేశంలో మోహన్‌లాల్‌ను అభినందిస్తూ తీర్మానించినట్టు మా–ఏపీ వ్యవస్థాపకుగు దిలీప్ రాజా తెలిపారు.

ఘనంగా సామూహిక లలిత సహస్ర నామ పారాయణ

అమర్తలూరు(వేమూరు): పవిత్ర భాద పద మాస అమావాస్యను పురస్కరించుకొని గోవాడ పార్వతి సమేత బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక లలిత సహస్ర నామ పారాయణ, కోటి కుంకుమార్చన, హోమం ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణశ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి బి.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస శర్మ మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అని ఆ జగన్మాత పరాశక్తి పరమేశ్వరి నామాలను ఇంత మంది మహిళలు ఈ క్షేత్రంలో పారాయణ చేయడం మన అదృష్టమన్నారు. ఈ కార్యక్రమానికి గూడవల్లి మైత్రి ఆశ్రమం వారు అన్న ప్రసాదాన్ని అందించారు. నల్లూరు ఆశ్రమం చక్రవర్తి మహిళలచే లలితా సహస్ర నామ పారాయణను చేయించారు. మరదాప కోటేశ్వరరావు ఉచిత రీతిన సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీధర్ శర్మ, పొన్నపల్లి సత్యనారాయణ శర్మ, హిందూ ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, మండవ రమేష్, తోలు బాలకృష్ణ, పావులూరు వరలక్ష్మి, గంటా నిర్మల, పావులూరు రమేష్, హరే శ్రీనివాస్, భజన సంఘాల మహిళలు పాల్గొన్నారు.



లలిత సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు

నేటి నుంచి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

బాపట్ల: లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో కోన ప్రభాకరరావు కళాక్షేత్రంలో దసరా శరన్నవ రాత్రి మహోత్సవాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమంతరావు మాట్లాడుతూ 22వ తేదీ (సోమవారం) నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 3వ తేదీ చండీ హోమం ఉంటుందన్నారు. 22వ తేదీ ఉదయం 7.30 గంటలకు కలశ స్థాపన, ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలు ఉంటాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు: ఈ నెల 23వ తేదీ నుంచి 26 వరకు ఆధార్ అప్‌డేట్‌కు పట్టణంలోని పలు వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 23, 24 తేదీలలో 26వ వార్డు గాజులపాలెం, 8వ వార్డు క్యాబిన్‌పేట, 31వ వార్డు సాంబశివనగర్, 18వ వార్డు టీచర్స్ కాలనీ సచివాలయాల్లో, 25, 26 తేదీలలో 25వ వార్డు ఎస్సీ, ఎస్టీ కాలనీ, 13వ వార్డు జయభారతరెడ్డి, 31వ వార్డు సాంబశివనగర్(2), 18వ వార్డు టీచర్స్ కాలనీ(2) సచివాలయాల్లో ఆధార్ సేవలు పొందాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ప్రస్తుతం డయేరియా ఎక్కువగా వ్యాపిస్తున్న కారణంగా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని కమిషనర్ రమేష్‌బాబు సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, తాగునీటి సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని అన్నారు. 08643–247737 నంబరుకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇస్తే వెంటనే సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కర్లపాలెం: మండల పరిధిలోని పేరలి కొత్తపాలెం సమీపంలో ఉన్న పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్‌ఐ జి.రవీంద్ర తెలిపిన వివరాల మేరకు... పేరలి కొత్తపాలెం, మత్రికట్టవ గ్రామాల మధ్య ఉన్న పంట కాలువలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు తుమ్మలపల్లి వీఆర్వో సుధాకర్ ఫిర్యాదు చేసారని తెలిపారు. వీఆర్వో సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీయించి శవ పంచనామా నిర్వహించామన్నారు. కాలువలో నీటి ఒరవడి ఎక్కువగా ఉండటం వలన ఎగువ నుంచి మృతదేహం కొట్టుకువచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. మృతుని వయస్సు సుమారు 25 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. మృతదేహంపై ఎరుపు రంగు రౌండ్ నెక్ టీ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440900870 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.



పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల పని గంటలను పెంచాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పాండురంగ ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. గంగానమ్మపేటలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులు, పెన్షనర్స్ 140 సంవత్సరాల క్రితం పోరాడి 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు. నూతన కార్మిక చట్టాలు, కార్మికులు, ఉద్యోగుల హక్కులను హరించేవిధంగా ఉన్నాయని ఆరోపించారు. పని గంటలు పెంచడం దారుణమన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వారానికి 35 గంటలు పని గంటలుగా ఉంటాయని చెప్పారు. పెట్టుబడిదారుల శ్రమదోపిడీలో ప్రభుత్వాలు భాగస్వామ్యం కావడం దురదృష్టకమరని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎన్నికల్లో అండగా నిలిచారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఒక సమస్య కూడా పరిష్కరించలేదని ఎద్దేవా చేశారు.

ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి ప్రజాప్రతినిధులు ఉద్యోగులకు చెల్లించాల్సిన కరువు భత్యం, డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైద్య బీమాను రూ.25లక్షలకు పెంచాలని కోరారు. జోన్ కన్వీనర్ పుట్టా జానర్ధరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీదా, నాయకులు సిహెచ్. లక్ష్మణ్ కుమార్, జి.దాసు, జి.శివరామకృష్ణ, మునగా వెంకటేశ్వరరావు, యోహాన్, శ్రీనివాసరావు, రామకృష్ణ, శివనాగేశ్వరరావు, లక్ష్మయ్య, పాపారావు, ఖుద్దూస్, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

వెస్ట్‌బెర్రీ స్కూలుకు ప్రతిష్టాత్మక టైమ్స్ బిజినెస్ అవార్డు

తెనాలి: పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని వెస్ట్‌బెర్రీ స్కూల్‌కు మరో విశిష్ట గౌరవం లభించింది. విద్యార్థి కేంద్రిత సృజనాత్మక విద్యా పద్ధతులను విజయవంతంగా అమలు చేస్తూ, విద్యలో కొత్త ఆవిష్కరణలకు మార్గదర్శకంగా నిలుస్తున్న విద్యాసంస్థగా గుర్తింపు పొందినందుకు ప్రతిష్టాత్మక టైమ్స్ బిజినెస్ అవార్డు – 2025ను అందుకుంది. టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో, రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహార – వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులమీదుగా ఈ అవార్డును అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్.విజయ్ కుమార్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ రవి చంద్ర ఈ అవార్డును స్వీకరించారు. పిల్లల ఆసక్తులు, ప్రతిభ, అభిరుచులను కేంద్రంగా సృజనాత్మక బోధనా విధానాలను అనుసరిస్తూ, అకడమిక్ విజయాలతోపాటు విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నైతిక విలువలతో కూడిన సమగ్ర వ్యక్తులుగా ఎదగటం లక్ష్యంగా విద్యాబోధనలో ఉన్న తమ స్కూలు ఈ అవార్డు రావటం ఎంతో ప్రోత్సాహకరమని ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఎదగడం మా ప్రధాన లక్ష్యం. ఈ అవార్డు మాకు మరింత ప్రోత్సాహం కలిగించింది'' అని అన్నారు. తమకు సహకరిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్నాంజనేయులు మండవకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

కొండపాటూరు(కాకుమాను): ప్రతి ఒక్కరు ఒక మొక్కనాటి దానిని సంరక్షించాలని అప్పుడే గ్రామాలలో పర్యావరణం లోపించకుండా ఉంటుందని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కొండపాటూరులో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. తిరుపతిరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ప్రధాని జన్మదినం పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా ప్రతి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. సేవే మా ధ్యేయం–సమాజమే మా దేవాలయం అనే నినాదంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, కాకుమాను మండల అధ్యక్షుడు యడ్లపాటి శ్రీధర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీ కొన్న లారీ



చెరుకుపల్లి: జాతీయ రహదారిపై వెళుతున్న మినీ ట్రక్కు లారీ ప్రమాదవశాత్తూ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. లారీలో ఉన్న వ్యక్తి తెలిపిన వివరాల ప్రకారం శనివారం నెల్లూరు నుంచి మచిలీపట్నం వెళుతున్న హిమజ మెరైన్స్‌కు చెందిన మినీ ట్రక్కు లారీ అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో చెరుకుపల్లి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదురుగా జాతీయ రహదారి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను వేగంగా ఢీ కొంది. ఈ ఘటనలో లారీ డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని పెకిలించి డివైడర్‌పై ఏర్పాటు చేసిన భారీ ఇనుప రైలింగ్‌ను ఢీ కొంది. అయితే ఈ ప్రమాదంలో లారీలో ఉన్న ముగ్గురు వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ ప్రమాదంపై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు.

అధికారుల సమన్వయంతోనే అభివృద్ధి

ఎంపీపీ జాలాది రూబేను

చుండూరు(వేమూరు): అధికారుల సమన్వయంతో మండల పరిషత్ అభివృద్ధి సాధించడం జరుగుతుందని ఎంపీపీ జాలాది రూబేను తెలిపారు. చుండూరు మండల పరషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ పని తీరుపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

● వలివేరు గ్రామ సర్పంచ్ పందిపాటి ఏసు మాట్లాడుతూ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ సర్పంచ్‌కు తెలియకుండా సొంత నిర్ణయాలతో పనులు చేస్తున్నారని సమవేశంలో తెలిపారు.

చుండూరు సహకార సంఘం అధ్యక్షుడు ఎల్లారెడ్డి వెలుగు క్రాంతి పథకంలో పూర్తి స్థాయి అవినీతి ఉందని, దర్యాప్తు చేయాలని ప్రజా ప్రతినిధులు కోరారు. దీంతో క్రాంతి పథకం అధికారిని ఎంపీపీ హెచ్చరించారు.

● మండూరు ఎంపీటీసీ సూర్యప్రభ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో పాఠశాల అసాంఘిక కార్యకాలపాలకు నెలవుగా మారిందన్నారు. ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆమె కోరారు.

కారుమూరిపాలెం గ్రామ సర్పంచ్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని, నడవటం కూడా కష్టంగా ఉందని అన్నారు. ప్రభుత్వం రోడ్లకు నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుదీప, ఎంపీటీసీ అమర్తలూరు ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ జాలది రూబేను

చలో అసెంబ్లీ కార్యక్రమం జయప్రదం చేయాలి

అమర్తలూరు(వేమూరు): భూ యజమాని అంగీకారంతో పని లేకుండా నూతన కౌలు చట్టం చేయాలని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం రూ.20 వేలు కౌలు రైతులకు వెంటనే ఇవ్వాలని కోరుతూ ఈ నెల 22వ తేదీన చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు తోడేటి సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్తలూరు మండలంలోని యడవూరు గ్రామంలో కౌలు రైతులతో ఆయన మాట్లాడుతూ నూతన కౌలు చట్టాని తెస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని అన్నారు. పాత చట్టం దుర్మార్గమైందని ఆ లోపాలను సరి చేస్తామని అధికారంలోకి రాగనే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇంత వరకు రూపాయి కూడా కౌలు రైతులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం విజయవాడ నుంచి చలో అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కౌలు రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక కౌలు రైతులు దున్నా బాలాజి, చందోలు కిరణ్‌కుమార్, పులి సిసింద్రీ, చందోలు శ్రీకాంత్, ఎర్రజల కుమారి, గంగాధర్ పాల్గొన్నారు.



యడవూరులో కౌలు రైతులతో మాట్లాడుతున్న సురేష్

• అడుగడుగునా గుంతలతో ఇబ్బందులు



వలివేరు నుంచి చుండూరు వెళ్లు రోడ్డుపై గుంతలో నిలిచిన వర్షపు నీరు

చుండూరు(వేమూరు): వలివేరు నుంచి చుండూరు వెళ్లు ఆర్ అండ్ బీ రోడ్డుపై పడిన గుంతల వల్ల ప్రయాణం చేయాలంటే భయం వేస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై అడుగడుగునా గుంతలతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల రోడ్డుపై గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేయడం నరకంగా మారిందని ప్రజలు అంటున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు గుంత లోతు తెలియక పడిపోవడం జరుగుతుందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్లపై దృష్టి సారించకపోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు చెబుతున్నారు. చుండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు అధికారులు వెళ్లడం కూడా కష్టంగా ఉందని అంటున్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే చర్యలు తీసుకొని రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల 'సేవా పక్వాడా'

తెనాలి: 22 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థులు ఆదివారం సేవా పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్నారు. కమాండింగ్ ఆఫీసర్ ఎ.ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో 145 మంది ఎన్‌సీసీ విద్యార్థులు సేవా కార్యక్రమం చేశారు. ప్రజలలో సేవా భావాన్ని పెంచడం, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, పర్యావరణ సంరక్షణ, ఆరోగ్యంపై దృష్టి సారించడం సేవా పక్వాడ ప్రధాన ఉద్దేశంగా కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎ.ఉదయ్ కుమార్ అన్నారు. ముందుగా మున్సిపల్ బాలుర హై స్కూల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎన్‌సీసీ విద్యార్థులు సేవా పక్వాడ నినాదాలు చేశారు. తదుపరి పాత గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. పట్టణంలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్, ఎన్‌సీఆర్‌ఎం హైస్కూల్, ఎస్‌ఆర్‌ఎస్ ఎంటీ హైస్కూల్, ఎస్ఎస్ఎస్ఎం హైస్కూల్, వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. 22 ఆంధ్ర బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ పర్యవేక్షించారు. ఎన్‌సీసీ అధికారులు పరిశా సర్దార్ , కొప్పంటి స్వామి అశోక్, పీఐ స్టాఫ్ సుబేదార్ సునీల్, బీహెచ్‌ఎం నాగరాజు, హవల్దార్ అనంత్ పాల్గొన్నారు.



పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు